RNI No: APTEL /25/A2860

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 10 | పేజీలు : 4 | ఆదివారం 12 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

ఏఐ యుద్ధాలు చేసినా గెలిచేది సైనికులేనన్న రాజ్‌నాథ్

విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి నౌకాదళంలోకి ప్రవేశం

సంప్రదాయ, ఆధునిక సైనిక శక్తి మధ్య సమతుల్యం అవసరం

యుద్ధనౌకల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

'మారిటైమ్ ఇండియా విజన్ 2030'తో ప్రపంచ హబ్‌గా భారత్

# పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు



ముంబై ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

భుజానికి మూడున్నర గంటల పాటు ఆపరేషన్ జరిగిందని వెల్లడి

పవన్‌కు మూడు వారాల పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు

ప్రజల మధ్యలో ఉన్నప్పుడు ఒత్తిడి కారణంగానే పవన్‌కు గాయమైందని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు.పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. "పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది" అని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. "పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు" అని చంద్రబాబు వెల్లడించారు.

**జాతీయ అంశాలపై స్పందన**

ఈ సందర్భంగా చంద్రబాబు పలు జాతీయ అంశాలపై కూడా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ప్రధాని మోదీ వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరిగింది. ఆయన కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తివంతమైన నాయకుడు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశం మాత్రం స్థిరంగా అధిక వృద్ధి రేటును సాధిస్తోంది. దీనికి కారణం మోదీ నాయకత్వమే. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతోంది. ఆయన నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. వియత్నాం పడవ ప్రమాదంపై మాట్లాడుతూ.. అది చాలా దురదృష్టకరమైన సంఘటన అని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మృతదేహాలను వెనక్కి తీసుకువస్తున్నామని, అక్కడున్న వారిని సురక్షితంగా వెనక్కి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇక ఉత్తరప్రదేశ్ లో అయోధ్య ఘటనపై మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విచారణ జరుగుతున్నందున కొంత సమయం వేచి చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూ.. ఒకప్పుడు 'బెంగాల్ ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది' అనే వారని, మధ్యలో ఆగిపోయిన ఆలోచన ఇప్పుడు మళ్లీ మొదలైందని, బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి అడిగిన ప్రశ్నకు, నాయకుల పనితీరును బట్టే ప్రజలు అంచనా వేస్తారని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా ఉన్నప్పుడే నాయకులకు విశ్వసనీయత లభిస్తుందని చంద్రబాబు పరోక్షంగా చురకలు అంటించారు. అనంతరం, పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యుల నివేదికను చంద్రబాబు మీడియాకు అందించారు.

## విశాఖకు జగన్.. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత



వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు. జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ప్రకటన విడుదల చేసిన ముంబై ఆసుపత్రి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ముంబై ఆసుపత్రి అధికారిక బులెటిన్

కుడి భుజానికి విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ పూర్తి

ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వెల్లడి

పూర్తిగా కోలుకుని భుజం సాధారణ స్థితికి రావడానికి 4 నెలల సమయం

ప్రముఖ వైద్యుడు డాక్టర్ దిన్‌షా పర్దివాలా ఆధ్వర్యంలో శస్త్రచికిత్స



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి యాజమాన్యం అధికారికంగా ఒక ప్రత్యేక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఆయన కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆసుపత్రి ఆర్థ్రోస్కోపీ అండ్ షోల్డర్ సర్వీస్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ దిన్‌షా పార్దీవాలా ఆదివారం (జూలై 12) ఈ ప్రకటన జారీ చేశారు. వైద్య బులెటిన్ ప్రకారం, పవన్ కల్యాణ్ కుడి భుజంలోని 'రొటేటర్ కఫ్'కు తీవ్రమైన గాయమైంది. భుజంలోని సుప్రాస్పినేటస్, ఇన్‌ఫ్రాస్పినేటస్ అనే కండర బంధనాలు (టెండన్స్) అధికంగా చిరిగిపోవడంతో పాటు, గ్రేటర్ ట్యూబరోసిటీ ఎముక వద్ద ఫ్రాక్చర్ కూడా అయినట్లు నిర్ధారణ అయిందని వైద్యులు వివరించారు. ఈ గాయానికి జూలై 11న కోకిలాబెన్ ఆసుపత్రిలో విజయవంతంగా 'ఆర్థ్రోస్కోపిక్ రిపేర్' సర్జరీ నిర్వహించినట్లు డాక్టర్ పార్దీవాలా పేర్కొన్నారు. కీ-హోల్ పద్ధతిలో జరిగిన ఈ ఆపరేషన్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని, ప్రస్తుతం పవన్ కల్యాణ్ సౌకర్యంగా ఉన్నారని బులెటిన్‌లో తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన కొంతకాలం విశ్రాంతి తీసుకుంటారని, ఆ తర్వాత వైద్యుల పర్యవేక్షణలో ఒక పక్కా ప్రణాళికతో కూడిన 'షోల్డర్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్' ఉంటుందని వెల్లడించారు. ఈ పునరావాస ప్రక్రియ ద్వారా రాబోయే నాలుగు నెలల్లో ఆయన భుజం పనితీరు తిరిగి పూర్తిగా సాధారణ స్థితికి వస్తుందని అంచనా వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు, జనసేన కార్యకర్తల్లో నెలకొన్న ఆందోళనకు ఈ అధికారిక ప్రకటనతో తెరపడినట్లయింది. ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## అక్టోబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

అక్టోబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

**అంకుశం న్యూస్ తిరుమల జూలై 12**

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను జూలై 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.

ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది.

**వర్చువల్ సేవల కోటా విడుదల**

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదల

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.



శ్రీవాణి దర్శన కోటా విడుదల

శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా...

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల...

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

ఆదివారం 12 జులై 2026

సీమ వార్త
# సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## గోవుల దాహం కోసం....
# పార్ధుని పాని

ఎంపీ నిధులతో గోశాలకై బోర్ బావి తవ్వకాలకు నిధులు మంజూరు చేసిన... బి.కె పార్ధసారథి.


మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు పాల్గొన్న పార్ధసారథి, తనయుడు సాయి... ఘన సన్మానం.

టిడిపి నేత అశ్వర్ధ రెడ్డి ఇంట్లో తేనీటి విందులో పాల్గొన్న పార్ధసారథి.



**గోరంట్ల జులై 12 సీమ వార్త సాయంత్రం.**

గోశాలలో పెరుగుతున్న అవుల దాహం తీర్చేందుకు హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె పార్ధసారథి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేసి బోరు బావి తవ్వకాలకు ముందుకొచ్చి వాటిని ప్రారంభించి అందరి మన్ననలు పొందుతున్నాడు. ఇందులో భాగంగా గుమ్మయ్య గారి పల్లి గ్రామ సమీపంలోని మారెమ్మ దేవి ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దేవి స్వామి అభ్యర్ధన మేరకు ఎంపీ పార్ధసారథి నిధులు మంజూరు చేసినట్లు దేవి స్వామి తెలిపారు. సందర్భంగా ఆదివారం బి.కె పార్ధసారథి మారెమ్మ ఆలయం చేరుకొని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు పాల్గొన్న అనంతరం దేవి స్వామి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ చివర గోశాల నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన భూమిలో బోరు బావి తవ్వకాలకై పార్ధసారథి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అశ్వర్ధ రెడ్డి ఇంట నీటి విందులో పాల్గొన్న పార్ధసారథి...



## తెల్ల పేపర్ సంతకాలపై...
# తిరగబడ్డ అంగన్వాడీలు..!!

పెత్తనం కోసం అంగన్వాడీలను....అడ్డంగా వాడుకుంది ఎవరు..!!

తెల్ల పేపర్ పై సంతకాలు... ఆపై కుట్ర పూరిత రాతలు.

సూపర్వైజర్ కర్తవ్యం కరెక్ట్ గా చేస్తోందని కుట్ర... వేధింపులు లేవు, వసూలు లేవు.

ఖాళీ పేపర్ల పై సంతకాలు చేయించుకున్నారు.... ఇష్టం వచ్చింది రాసుకున్నారు.

సొంత సంస్థను, సొంత అధికారులను బస్ట్ పట్టిచ్చే విధంగా...

ఉన్నత అధికారులను, పత్రికలను తప్పు ధోవ పట్టించిందెవరు.



**గోరంట్ల జులై 12 సీమ వార్త సాయంత్రం.**

అంగన్వాడీల న్యాయమైన కోరికల సాధన కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆందోళనకు వెళ్ళమని అక్కడ ఒకరిద్దరూ అంగన్వాడి కార్యకర్తలు గోరంట్ల మండలంలోని పలువురి అంగన్వాడి కార్యకర్తలతో కాళీ తెల్ల పేపర్ లపై సంతకాలు చేయించుకున్నారని ఆ కాళీ పేపర్లలో సంతకాలు చేయించుకున్న వారి ప్రమేయం లేకుండా సూపర్వైజర్ పై వారికున్న వ్యక్తి గత కక్ష లను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులకు ఆమె అవినీతి చేస్తుందని వేధిస్తోందని అసత్య సమాచారంతో కూడిన ఫిర్యాదును ఇచ్చిన సంఘటనపై గోరంట్ల మండలంలోని పదుల సంఖ్యలో అంగన్వాడి కార్యకర్తలు ఆ ఫిర్యాదును వచ్చిన వార్తలను ఖండించారు. ఒకటి రెండు పేపర్స్ లో "సూపర్వైజర్ వేధింపులపై అంగన్వాడీల ఆగ్రహం ""ఆ సూపర్వైజర్ మాకొద్దు "అని వచ్చిన వార్తల ను ఖండించారు. గోరంట్ల మండలం లోని గోరంట్ల, కొండాపురం సెక్టార్ల వర్కర్లు హెల్పర్లు తీవ్రంగా ఖండించారు. మేము కోర్కెల దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో 10 వ తేదీ ధర్నా చేస్తున్న సమయంలో గోరంట్లలోని నలుగురైదుగురు కార్యకర్తలు ధర్నాకు వచ్చినట్లు మమ్మల్ని సంతకాలు చేయాలని తెల్ల కాగితాల పై సంతకాలు చేయించుకున్నారు. మేము ఎప్పటి లాగే ధర్నాకు వచ్చినట్లు పేపర్లలో సంతకాలు చేశామని వివరించారు .

- మిగతా3లో

## మంత్రి ఇలాకాలోనే.....
# విచ్చలవిడిగా గంజాయి..!!

డ్రగ్స్ కట్టడిలో కూటమి ప్రభుత్వం విఫలం.

" సే నో టు డ్రగ్స్" 2 కే రన్‌లో వైసీపీ ఇంచార్జ్ ఉషశ్రీ చరణ్








**సోమందేపల్లి జులై 12 సీమ వార్త సాయంకాలం.**

యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలని పెనుకొండ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తితో యువతతో కలిసి 'సే నో టు డ్రగ్స్" 2 కే రన్‌ను ఆమె విజయవంతంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆదివారం ఉదయం మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ, చరణ్ రెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి సేనో డ్రగ్స్ నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని వైస్సార్ సర్కిల్ నుండి పెద్దమ్మగుడి, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కొత్తపల్లి క్రాస్, వైస్సార్ సర్కిల్ వరకు 2 కే రన్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై, స్థానిక మంత్రి తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.?అసెంబ్లీలో చెప్పిన మంత్రి.. ఇక్కడ ఎందుకు ఆపలేకపోతున్నారు ? " రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వ పెద్దలు తక్షణమే స్పందించి డ్రగ్స్ సరఫరాను అరికట్టాలి" అని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. పెనుకొండ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక మంత్రి ఇక్కడే ఉన్నారు. గంజాయికి ఎంతోమంది బానిసలయ్యారని స్వయంగా అసెంబ్లీ సాక్షిగా మంత్రి చెప్పారు. కానీ ఆమె సొంత నియోజకవర్గంలోనే గంజాయి విచ్చలవిడిగా సరఫరా జరుగుతుండటం, దాన్ని అరికట్టలేకపోవడం అత్యంత శోచనీయం, బాధాకరం" అని ఆమె విమర్శించారు. ?అధికారులు తక్షణమే దృష్టి సారించాలి. గంజాయి సులభంగా దొరుకుతుండటంతో ఎంతోమంది యువకులు డ్రగ్స్, ఆల్కహాల్‌కు బానిసలవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "భారతదేశానికి యువతే భావి పౌరులు. వారికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుంది. కానీ ఆ భవిష్యత్తును నాశనం చేసుకుంటూ డ్రగ్స్ మత్తులో కూరుకుపోతున్నారు. దీనిపై తక్షణమే అధికార యంత్రాంగం, పోలీసు అధికారులు దిగివచ్చి కఠిన చర్యలు తీసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు.?ఈ డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన యువతీ యువకులకు, సోదరులకు తన తరపున చరణ్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.



సీమ వార్త సాయంకాలం

ఆదివారం
12 జూలై 2026


## కొత్తచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోరంట్ల వాసి మృతి



**గోరంట్ల జులై 12 సీమ వార్త సాయంత్రం.** కొత్తచెరువు మండల కేంద్రం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోరంట్ల పట్టణానికి చెందిన మేదర నాగభూషణం మృతి చెందినట్లు సమీప బంధువులు తెలిపారు. తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. వ్యక్తిగత పనుల నిమిత్తం మృతుడు నాగభూషణ తన ద్విచక్రవాహంలో కొత్తచెరువు మండల కేంద్రం నుంచి ధర్మవరం వైపు వెళు తుండగా పట్టణ చివర ఓ కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు.కొత్తచెరువు సమీపంలో గోరంట్ల మా చిన్నాన్న మేదర నాగభూషణం వ్యాపారం నిమిత్తం వెళ్తుండగా కొత్తచెరువు దగ్గర కట్టు డిపో సమీపంలో

## తెల్ల పేపర్ సంతకాలపై... తిరగబడ్డ అంగన్వాడీలు..!!


-మొదటిపేజీ తరువాయి


ఆ సంతకాలు పెట్టిన పేపర్ లో ఏం రాసుకొన్నారో మాకు తెలియదు .నాగరాణి మేడం మాతో ఎటువంటి డబ్బులు వసూలు చేయలేదు .ఒక్క రూపాయి కూడా మేము తనకు ఇవ్వలేదు. సెక్టార్కు సంబంధించి ఏమైనా జిరాక్స్ అవసరమై నప్పుడు కూడా మాతో పెట్టనివ్వరు .తన సొంత ఖర్చులతో జిరాక్సు కూడా చేయిస్తారు. మా సెంటర్ కు విజిట్ వచ్చిన సమయంలో కూడా మంచినీళ్లు కూడా తను ముట్టుకోరు. మేడం భర్త ప్రైవేట్ లెక్చరర్ తను ఎప్పుడు మా విధుల్లో జోక్యం చేసుకోలేదు. మేము కోరికల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ధర్నా చేస్తున్న సమయంలో తీసిన ఫోటోను ఇలా ట్యాగ్ చేసి వార్త రాయడం నిజంగా దారుణం . దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము .ఇంకా మాకు సూపర్వైజర్ వచ్చినప్పటినుండి సరుకులు సకాలంలో అందుతున్నాయి. సెంటర్ విజిట్ చేసినప్పుడు మా సమక్షంలోనే సరఫరాదారులతో మాట్లాడి మా సెక్టార్లకు సరుకులు ముందుగా వేయిస్తారు .సరుకులు వేయించిన తరువాత మాతో ఆన్లైన్లో రసీదులు చేయిస్తారు. సరుకులు అందిన తరువాత మాత్రమే ఆన్లైన్ చేయాలని పదేపదే చెబుతారు. ఇలాంటి నిజాయితీగల సూపర్వైజర్ మీద ఇలాంటి అభియోగాలు వచ్చినందుకు మేము చాలా బాధపడుతున్నాము .మరియు తీవ్రంగా ఖండిస్తున్నాము. మాతో ఇన్ టైం లో అన్ని ఇండికేటర్లు పూర్తి చేయాలనీ , 9 నుండి 4 వరకు సెంటర్లలో ఉండాలని, ఆన్లైన్ లో సరైన సమయంలో స్టాక్ రసీదులు అటెండెన్స్ లు వేయాలని, టి హెచ్ ఆర్ పంపిణీ సవ్యంగా జరగాలని పీఎం ఎం వి వై లో అర్హులైన లబ్ధిదారులను వెంటనే రిజిస్టర్ చేయాలని , ప్రీస్కూల్ కార్యక్రమాలు సిలబస్ ప్రకారం పిల్లలకు నేర్పాలని పని చెప్పడం వలన కొందరు వర్కర్లు పనిచేయలేక ఇలాంటి అవాస్తవాలు సృష్టించారు .మేము దీనిని పూర్తిగా ఖండిస్తున్నాము. మమ్మల్ని మోసం చేసి మాతో సంతకాలు చేయించుకుని మా మేడం పైన ఇలాంటి అవాస్తవాలు రాయడం మేము తీవ్రంగా ఖండిస్తున్నాము .దీనిపైన మా పై అధికారులకు ఫిర్యాదు కూడా చేస్తామన్నారు. సొంత సంస్థ పైన మరియు సొంత అధికారులను బస్ట్ పట్టించే విధంగా ఉన్నత అధికారులకు, కొన్ని పత్రికలకు తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ, అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేడు విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు. నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలు.. సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాలను సమర్థవంతంగా మేళవించగల భారత శక్తిని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఆత్మరక్షణకే కాకుండా అవసరమైనప్పుడు శత్రువుపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టి, వారిని పూర్తిగా నిర్మూలించగల సత్తా భారత్‌కు ఉందని ఈ ఆపరేషన్ రుజువు చేసిందని పేర్కొన్నారు. యుద్ధనౌకల నిర్మాణం కేవలం నౌకాదళాన్ని బలోపేతం చేయడమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఒక యుద్ధనౌక నిర్మాణం అంటే ఒక పరిశ్రమల వ్యవస్థను నిర్మించడమే. ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్ వంటి ఎన్నో రంగాలను ఇది ముందుకు నడిపిస్తుంది. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది, కొత్త టెక్నాలజీలు అభివృద్ధి చెందుతాయి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది" అని తెలిపారు. భారత్‌ను నౌకా నిర్మాణ రంగంలో గ్లోబల్ హబ్‌గా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'పై వేగంగా పనిచేస్తున్నామని చెప్పారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ వంటి పథకాల ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## వియత్నాంలో ఘోర ప్రమాదం..

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ స్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## నాగారపమ్మ తల్లిని దర్శించుకున్న టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, గుట్ట బాబు



**టి. సుండుపల్లి జూలై 12 సీమ వార్త సాయంత్రం.** మండల పరిధిలోని పెదినేని కాలువ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లిని ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు (గుట్ట బాబు) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పొలిమేరపల్లి చెందిన చంద్రశేఖర్, శ్రీనివాసులు వారి ఆహ్వానం మేరకు విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చప్పిడి మహేష్ నాయుడు మాట్లాడుతూ నాగారపమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు (గుట్ట బాబు) మాట్లాడుతూ, అమ్మవారి కృపతో ప్రజలందరూ సిరిసంపదలు, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద నాయక్, రెడ్డి మల్లప్ప నాయుడు,రెడ్డయ్య, సుబ్బరామప్ప నాయుడు, జయరాం నాయక్,రామప్ప నాయుడు,శేషారెడ్డి,ప్రభాకర్ నాయుడు,రవీంద్ర రాజు,మహేశ్వర రాజు, రెడ్డి చైతన్య, రెడ్డి శేఖర్, రామ్మోహన్ రాజు, రెడ్డయ్య రాజు, చంద్రశేఖర్ రాజు, పెద్దబాబు రాజు, గిరిరాజు, రమేష్ పాల్గొన్నారు.

## సూపర్వైజర్ పై... వారిచ్చిన సమాచారం అవాస్తవం.

**తనపై వచ్చిన వార్తలను ఖండించిన... ఐ సి డి ఎస్ సూపర్వైజర్ నాగరాణి**

**గోరంట్ల జులై 12 సీమ వార్త సాయంత్రం.** ఈ నెల 11 వ తేదీ రెండు పత్రికలలో నా పై వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవం.నేను అంగన్వాడి కార్యకర్తల నుండి డబ్బులు వసూలు చేయడం,నా భర్త వారి పై పెత్తనం చేస్తున్నాడు అనడం, చీటీలు కట్టమని వేధిస్తున్నాను అనడం,నేను వేధిస్తున్నాను అనడం పూర్తిగా అవాస్తవం అని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఖండించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ .మా పై అధికారుల నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం ,సూపర్వైజర్ డ్యూటీ చార్ట్ ప్రకారం మాత్రమే నేను నా విధులు నిర్వహించాను. అంగన్వాడి కార్యకర్తలు నిర్వహించవలసిన అన్ని పనులు సమయానుసారం పూర్తి చేయించడానికి వారితో వారి విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చి పని చేయించాను. ప్రభుత్వ కార్యక్రమాలు అన్ని ప్రతి లబ్ధిదారులకు అందేలా నా విధులు నేను నిర్వహించాను.ఒకరిద్దరు కార్యకర్తలు వారి విధులు నిర్వహించలేక 10 వ తేదీ నాడు జరిగిన కోరికల దినోత్సవం సందర్భంగా జరిగిన ధర్నా లో అంగన్వాడి కార్యకర్తల తో ధర్నాకు వచ్చినట్టు తెల్ల పేపర్ పైన సంతకాలు చేయించుకుని ,ఆ పేపర్ లో నాపైన అవాస్తవాలు రాసి నాపైన పిర్యాదు చేశారు.నా పైన వచ్చిన ఆరోపణలు అన్ని అవాస్తవాలు అని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.నా పైన వచ్చిన వార్తల పై మా అధికారులు విచారణ చేసి అది రుజువు అయితే నా పై ఎటువంటి చర్యలకైన నేను సిద్ధంగా ఉన్నాను. .కానీ నా విధి నిర్వహణ లో నేను నిజాయితీగా ఇప్పటివరకు ఎటువంటి పిర్యాదు లేకుండా విధులు నిర్వహిస్తున్నప్పటికీ నాపై ఆధారాలు లేకుండా పిర్యాదు చేసి నా మర్యాద కు భంగం కలిగించిన ఈ విషయం పై లోతుగా విచారణ జరిపి ఇది అవాస్తవమని తేలితే,నా పై పిర్యాదు చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కూడా నేను మా అధికారులను కోరడం జరిగిందన్నారు.

## 27 నుంచి 29 వరకు లేపాక్షిలో సైతాంతిక శిక్షణా తరగతులు.

**గోరంట్లలో కరపత్రాలు విడుదల చేసిన... సిపిఐ నాయకులు.**



**గోరంట్ల జులై 12 సీమ వార్త సాయంత్రం.** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 27, 28, 29 రాజకీయ సైదాంతిక శిక్షణ తరగతులు స్థలము లేపాక్షి లోని ఆర్ జె హెచ్ ఫంక్షన్ హాల్ లో జరుగును సిపిఐ రాజకీయ శిక్షణా తరగతుల కరపత్రాలు గోరంట్ల మండలంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలస్వామి అధ్యక్షతన కరపత్రాలు రిలీజ్ చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి సత్యసాయి జిల్లా సిపిఐ పార్టీ కార్యకర్తలందరూ పాల్గొని శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని రాజకీయంగా సైతాంతికంగా ప్రతి ఒక్క కార్యకర్త అవగాహన పెంచుకొని ప్రజా సమస్యల పైన పోరాటం చేయాలని రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు ఈ శిక్షణా తరగతులకు మూడు రోజులపాటు ప్రతి ఒక్క కార్యకర్త లేపాక్షి లోనే బస చేసి శిక్షణా తరగతులను జయప్రదం చేయవలసిందిగా కోరారు ఈ శిక్షణా తరగతులకు సిపిఐ పార్టీ జాతీయ రాష్ట్ర కార్యదర్శులు హాజరవుతారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నరసింహ పల్లి ఆంజనేయులు గోరంట్ల సిపిఐ నాయకులు నార్సింపల్లి కృష్ణ వెంకటేశు మనోహర తదితరులు పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది

## జిల్లా కలెక్టర్ కు ఘనంగా సన్మానం



**మడకశిర జులై 12 సీమ వార్త సాయంత్రం.** మండల పరిధిలోని కల్లుమర్రి పంచాయతీలో ఆదివారం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఎస్ ఐ ఆర్ గురించి కల్లుమర్రి సచివాలయం నందు చర్చించడం జరిగింది. అలాగే బీసీ వెల్ఫేర్ హాస్టల్ నందు తనిఖీ చేయడం జరిగింది .కలెక్టర్ ని మండల కన్వీనర్ నాగరాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు కల్లుమర్రి నాగరాజు , తహసిల్దార్ పూజారి ముకుంద, రెవెన్యూ సిబ్బంది ఎంపీడీవో సచివాలయ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి గారూ! కొప్పర్తి పారిశ్రామిక సాంకేతిక శిక్షణా కేంద్రం ఏర్పాటు ఎప్పుడు?

-డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె, జులై 12, సీమవార్త సాయంత్రం.** కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామికవాడలో పారిశ్రామిక సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం తులసి రెడ్డి వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన 6 నెలల లోపల కేంద్ర ప్రభుత్వం విశాఖ – చెన్నై పారిశ్రామిక వాడను నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో 13వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొనడం జరిగిందని అన్నారు. ఆలస్యమైనప్పటికీ ఇప్పుడిప్పుడే ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇందులో భాగంగా 2023 డిసెంబర్ 4వ తేదీన కేంద్ర ప్రభుత్వం కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడలో పారిశ్రామిక సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని 250 కోట్ల రూపాయల అంచనా వ్యయం తో 19.5 ఎకరాలలో మంజూరు చేసింది. కానీ దురదృష్టవశాత్తు రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాన్ని కడప జిల్లా కొప్పర్తి నుండి అమరావతికి మారుస్తూ 2024 సెప్టెంబర్ 24న జీవో 56 జారీ చేసింది. ఈ విధంగా రాయలసీమకు తీరని అన్యాయం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నం చేసింది. దీనిపై రాయలసీమ ప్రాంతం నుండి, ప్రత్యేకించి కడప జిల్లా నుండి ప్రజలు,రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు కూటమి ప్రభుత్వం పై తీవ్ర నిరసన తెలియజేశాయి. ప్రజా స్పందనకు భయపడి ఈ కేంద్రాన్ని అమరావతికి మార్చము, కొప్పర్తి లోనే ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రెండు సంవత్సరాలు అయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వ వాలకమ్ చూస్తుంటే ఈ కేంద్రాన్ని అమరావతికి తరలించాలన్న దుర్బుద్ధి ఏమైనా ఉందా అన్న అనుమానం వస్తోంది. అదే జరిగితే కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని తులసి రెడ్డి హెచ్చరించారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టెండర్స్ పిలిచి, పనులు ప్రారంభించి, త్వరలో ఈ సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాయలసీమ ప్రజల ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. గంధర్వ గాయని శ్రీమతి ఎస్ జానకమ్మ మృతి పట్ల తులసి రెడ్డి విచారం వ్యక్తం చేశారు.ఆమెలేని లోటు సంగీత ప్రపంచంలో మరెవరు తీర్చలేరని అన్నారు. జానకమ్మ పవిత్రాత్మకు పరమేశ్వరుడు ప్రశాంతిని ప్రసాదించాలని తులసిరెడ్డి ప్రార్థించారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుడి భుజానికి శస్త్ర చికిత్స విజయవంతం కావడం పట్ల తులసి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థించారు.

## సర్ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియను పరిశీలించిన: జిల్లా స్పెషల్ ఆఫీసర్ క్రిష్టప్ప,



**నల్లమాడ:జూలై12 (సీమ వార్త): సాయంత్రం.** మండలంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా స్పెషల్ ఆఫీసర్ క్రిష్టప్ప ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మండలంలోని151,152, పోలింగ్ బూత్ లను,అలాగే గోపేపల్లి161,పోలింగ్ బూత్‌లను సందర్శించి,బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు.ఆన్‌లైన్‌లో నమోదు ఎలా జరుగుతోందో అధికారులను అడిగి తెలుసుకుని,ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు అయ్యేలా పూర్తి పారదర్శకతతో పని చేయాలని సూచించారు. అయితే రెండు రోజులు మాత్రమే ఓటరు నమోదు గడువు ఉందని,కావున పెండింగ్ లో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.దీంతో దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలని బీఎల్‌వోలకు దిశానిర్దేశం చేశారు.ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంతేకాక మండల వ్యాప్తంగా 33837 మంది ఓటర్లు ఉండగా,ఇప్పటివరకు 31023 మంది ఓటర్ల ను నమోద ప్రక్రియ చేశారని, ఇందులో 91.68% శాతమంది ఓటర్లను పూర్తయిందని.మిగిలిన 2814 మంది ఓటర్లను రేపటిలోగా పూర్తిచేయాలని ఆయన అధికారులకు తెలియజేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తహసిల్దార్ కే.మనోజ్ కుమార్ రెడ్డి,అంగనవాడి సూపర్వైజర్ సత్యవతి తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

ఆదివారం
12 జూలై 2026

# ప్రతిభకు పట్టం..
# హట్టి గొల్ల విద్యార్థులకు ఘన సత్కారం

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని వక్తల పిలుపు

డీఎస్సీ--2025లో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు అభినందన సభ



**కళ్యాణదుర్గం, జూలై 12 సీమవార్త సాయంత్రం.** హట్టి గొల్లలు విద్యను ఆయుధంగా చేసుకుని అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం నియోజకవర్గ హట్టి గొల్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం, అలాగే డీఎస్సీ--2025లో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి. తిప్పేస్వామి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వై. నరసింహప్ప, కళ్యాణదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ చిక్క బొమ్మప్ప, హట్టి గొల్లల జీవన విధానంపై పీహెచ్‌డీ చేసిన డా. యశోధర్, బ్యాంకు మేనేజర్ రఘువీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తిప్పేస్వామి మాట్లాడుతూ విద్య ద్వారానే వ్యక్తిగత, సామాజిక మార్పు సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించి ఇంజినీరింగ్ వంటి ఉన్నత రంగాల్లో రాణించాలని, కృషి, పట్టుదలతో లక్ష్యసాధనకు కట్టుబడి ఉండాలని సూచించారు. హట్టి గొల్లల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వై. నరసింహప్ప కన్నడలో ప్రసంగాన్ని ప్రారంభించి హట్టి గొల్లల చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి, జీవన విధానాన్ని విశదీకరించారు. విద్య ద్వారా సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని, యువత విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుండి నాయకత్వం వహించాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు.

లెక్చరర్ చిక్క బొమ్మప్ప మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. హట్టి గొల్ల ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేసి, డీఎస్సీ--2025లో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ హట్టి గొల్ల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిత్తప్ప, ప్రధాన కార్యదర్శి గోవిందప్ప, గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి చిత్తయ్య, బ్యాంకు మేనేజర్ రఘువీర్, సంఘం నాయకులు రవి, యాదవమూర్తి, ఎర్రంపల్లి చిత్తయ్య, హనుమంత రాయుడు, నరసింహులు, తమ్మన్న, మంజునాథ్, శ్రీరామ్, తిప్పేస్వామి, ఈరన్న, ఎర్రకొండాపురం చిత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాపాఘ్నిలో ఇసుక బండ్లు..
# రాత్రీ పగలూ రయ్.. రయ్..





కలెక్టర్ ఆదేశాలు బేఖాతారు

రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణా

సుదూర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయల సంపాదన

వేంపల్లె లో బరితెగించిన అధికార పార్టీ నేతలు

నిస్సహాయస్థితిలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు

**వేంపల్లి జూలై 12 సీమ వార్త సాయంత్రం.** జూన్ 2న తేదీన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నదీ గర్భాలలో అక్టోబర్ 15 వ తేదీ వరకు ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని చెప్పారు. పాపాగ్ని నదిలో ఆ ఊసే కనిపించడం లేదు. సహజ వనరులను అధికార పార్టీకి చెందిన కొందరు నమిలి మింగేస్తున్నారు. కంచె చేను మేస్తే కాపేమి చేయగలడు అన్న సామెత ఇసుక అక్రమ రవాణా విషయంలో అక్షరాలా నిరూపించబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను వేరెవ్వరూ చెరపట్టకుండా వాటికి కంచెగా నిలవాల్సిన అధికార పార్టీ నేతలే ఆ ఆస్తులను కాజేస్తే, వాటికి కాపలా ఉన్న అధికార యంత్రాంగం ఏం చేస్తుంది పాపం..? వేంపల్లి మండలంలో బరితెగించిన పెద్ద మనుషులు పాపాఘ్ని నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా నదిలోనే హిటాచ్ యంత్రాన్ని పెట్టి పదుల సంఖ్యలో వాహనాలకు ఇసుకను తోడిపోస్తున్నారు. అక్రమ ఇసుకను సుదూర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారు. ఇదంతా పేరుగాంచిన అధికారపార్టీ నేతలే చేస్తుండడంతో.. చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు మిన్నకుండిపోయారు. దశాబ్దాలుగా పాలక వర్గాల చేతిలో దోపిడికి గురవుతున్న పాపాఘ్నిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**ఇతర జిల్లాలకు ఇసుక తరలింపు**

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ప్రజల అవసరాల కోసం ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆయా నదుల్లో కేటాయించిన ప్రాంతం నుంచి గృహ అవసరాల నిమిత్తం ట్రాక్టర్లతో పరిమితికి లోబడి ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అంతేగాని ఏ ఒక్కరు కూడా ఇతర జిల్లాలకు ఇసుకను తరలించరాదు. అయితే చక్రాయపేట మండలం వేంపల్లె మండలంలోని ఎద్దుల కొండ సమీపంలోని పాపాగ్ని నది నుంచి పదుల సంఖ్యలో వాహనాల ద్వారా అక్రమార్కులు ఇసుకను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. సగటున రోజుకు టిప్పర్లు, ట్రాక్టర్లు అనుమతులు లేకుండా ప్రక్కనే ఉన్న అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు, బెంగుళూరుకు ఇసుకను మోసుకెళుతున్నాయి. ఒక్క ఇసుక రవాణా ద్వారానే ఖర్చులు పోను రోజుకు సుమారు 3 నుంచి 4 లక్షల రూపాయలు అక్రమార్కులు వెనకేసుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా.

ఖాళీ అవుతున్న పాపాఘ్ని..

నది నుంచి ఇసుకను తోడేందుకు ఏకంగా ఒక హిటాచ్ యంత్రం రాత్రింబగళ్ళు అక్కడ పనిచేస్తోంది. ఒక ట్రాక్టరుకు ఇసుకను నింపితే 750 రూపాయలు, టిప్పరుకు 5 వేల రూపాయల వంతున 2 హిటాచ్ లు పాపాగ్ని నదిలో ఇసుకను తోడేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. మంచి ఇసుక దొరికే ప్రాంతం నుంచే పదేపదే తోడిపోస్తుండడంతో నదిలో చాలాచోట్ల ఐదారు మీటర్ల లోతు గుంతలు పడ్డాయి. విచిత్రం ఏమిటంటే ట్రాక్టర్లు, టిప్పర్లు నదిలోనికి వెళ్లడానికి అనుకూలంగా నదిలో ఎర్రమట్టితో దారిని కూడా వేసుకున్నారంటే ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

**కళ్ళప్పగించి చూస్తున్న అధికార యంత్రాంగం..**

పట్టపగలే ఇంత పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతూ ఉంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందన్న అనుమానాలు సాధారణంగా కలుగుతాయి. కానీ అధికారపార్టీ అధినాయకుల వద్ద మంచి పేరు సంపాదించిన స్థానిక నేతలే ఇలా ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తుండడంతో వీరేమీ చేయలేకపోతున్నారు. కళ్ళముందే పాపాగ్ని ఖాళీ అవుతున్నా, భూగర్భజలాలు అడుగంటిపోతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు నిస్సహాయ స్థితిలో నిలబడిపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వేంపల్లి మండలం పై కాస్త దృష్టి సారించి ఇసుక దోపిడిదారుల చెర నుంచి పాపాగ్ని నదిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఇళ్ల స్థలాలకు నష్టపరిహారం ఇచ్చారు..
## స్థలాలు స్వాధీనం చేసుకోవడంలో జాప్యం

-పరిహారం చెల్లించిన స్థలం స్వాధీనంపై అలక్ష్యం

-స్థలం స్వాధీనంపై చేతులు మారిన డబ్బులు

**వేంపల్లె, జులై 12, సీమవార్త సాయంత్రం.** వేంపల్లె ప్రధాన రహదారిలో రూ 47.08కోట్లుతో రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఒక వైపు నాలుగు రోడ్ల కూడలి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు డ్రెయినేజీ, రోడ్డు పనులు పూర్తి కావచ్చింది. తాజాగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నుంచి రెండవ వైపు రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారు. తొలుత మురుగు కాలువలు నిర్మించాల్సి ఉండగా 72 అడుగల మేర రోడ్డు, మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది. తొలుత కాలువ పనులకు చేపట్టగా ప్రభుత్వం చెల్లించినా పరిహారం మేరకు తీసుకున్న స్థలం వరకు ఆక్రమణలు తొలగించలేదు.



ఇందుకు స్థలం సదరు భవన యాజమానులు నుంచి స్థానిక అధికార పార్టీ నేత...

## కామ్రేడ్ వెంగమ నాయుడు 29వ వర్ధంతి
## -----సిపిఐ నాయకులు ఘన నివాళులు



**యాడికి జులై 12 సీమ వార్త సాయంకాలం** సీనియర్ నాయకులు వీకే ప్రదీప్ రెడ్డి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ నేత ,పోరాటయోధుడు, కామ్రేడ్ వెంగమ నాయుడు 29వ వర్ధంతిని ఆదివారం యాడికి మండల కేంద్రంలోని వెంగమ నాయుడు కాలనీలో సిపిఐ నాయకులు కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నాయకులు వీకే ప్రదీప్ రెడ్డిముఖ్య అతిథిగా హాజరై భారత కమ్యూనిస్టు పార్టీజెండాను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్.సీపీఐ సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి, నీలూరు లక్ష్మయ్య, సామాజికవేత్త జూటూరు అబ్దుల్ రజాక్, హనుమంత నాయుడు, బండారు బాల ,కుల్లాయి రెడ్డి సిపిఐ నాయకులు, కాలనీవాసుల తో కలిసి కామ్రేడ్ వెంగమ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ, కామ్రేడ్ వెంగమ నాయుడు తన జీవితా కాలంలో నిరుపేద, బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలిచి పోరాడారని కొనియాడారు. అనేక ఉద్యమాలలో పాల్గొని రైతు కూలీల హక్కుల కోసం, కార్మికుల సంక్షేమం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశారని గుర్తు చేశారు.వెంగమ నాయుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి, పేద ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఐ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చారు ఆంజనేయులు, పుట్లూరు నరసింహులు, రంగం ఓలయ్య, వెంకటస్వామి, చౌడప్ప, రామాంజనేయులు రెడ్డి,లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ రెడ్డి, ఓబుల రెడ్డి పెద్దిరాజు శ్రీనివాసులు, నాగవేణి ,వెంకటమ్మ ,సుబ్బమ్మ, నారాయణమ్మ వెంగమ నాయుడు కాలనీవాసులు పాల్గొన్నారు

## శాప్ చైర్మన్ కు పూర్ణకుంభంతో
## స్వాగతం పలికిన ఆలయ అధికారులు, చైర్మన్



**లేపాక్షి జులై 12 సీమ వార్త సాయంకాలం :** లేపాక్షి గ్రామంలో వెలిసిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అని మినీ రవి నాయుడు విచ్చేశారు. ఆయన రాక సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణు గోపాలరావు, ఆలయ ఈవో ఎంహెచ్ నరసింహమూర్తి, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో గణేష్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి అమ్మవార్ల ప్రత్యేక పూజా కార్యక్రమంలో శాప్ చైర్మన్ పాల్గొ నడం జరిగింది. అనంతరం తీర్థప్రసా దాలను ఆయనకు ఆలయ అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజేష్ , టిడిపి మండల కన్వీనర్ అభిలాష్, కేంద్ర పురావస్తు శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వంద శాతం పకడ్బందీగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





**మడకశిర, జూలై 12 సీమ వార్త సాయంత్రం.** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం - 2026 ఎస్ ఐ ఆర్ లో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి శ్యాం ప్రసాద్ ఆదివారం మడకశిర మండలంలో విస్తృతంగా పర్యటించారు. నగర పంచాయతీ పరిధిలోని 193, 194 నెంబర్ గల పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, సవరణలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: ఇన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు వేగవంతం చేస్తూ, 100 శాతం లోప రహితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాల నిర్ధారణ కోసం బి.ఎల్.ఓ.లు సదరు ఓటరు ఇంటికి తప్పనిసరిగా మూడు సార్లు వెళ్లాలని ఆదేశించారు.మూడు సార్లు ఓటరు ఇంటిని సందర్శించినట్లు స్పష్టమైన ఆధారంగా ఫోటోలు తీసి, వాటి ప్రింట్‌లను తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన పూర్తి విచారణ నివేదికను దరఖాస్తులతో పాటు ఖచ్చితంగా జతపరచాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల నోడల్ అధికారిణి శోభారాణి, తహసీల్దార్ పూజారి ముకుంద , ఎంపీడిఓ సోనియా బాయి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి ఎన్నికల సిబ్బంది రామకృష్ణ, ,సంబంధిత మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881